# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 6, నవంబరు, 2014

తెలంగాణలో మహిళల భద్రత, మహిళలకు సంబంధించిన సమస్యల సత్వర పరిష్కారం కోసం 24 గంటల పాటు పనిచేసే హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. 181 టోల్‌ఫ్రీ నెంబర్‌తో ఈ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మహిళల సమస్యలు - పరిష్కార మార్గాలు అనే అంశంపై అధ్యయనం చేసిన పూనం మాలకొండయ్య నేతృత్వంలోని కమిటీ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి కేసిఆర్ గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, డిజిపి అనురాగ్‌శర్మ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమీషనర్లు, మహేందర్‌రెడ్డి, సివి.ఆనంద్, యంపి.జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే గొంగిడి సునిత, అధికారులు పూనం మాలకొండయ్య, స్వాతి లక్రా, సౌమ్యా మిశ్రా, స్మితా సబర్వాల్, చారుసిన్హా, శైలజారామయ్యార్, రమణరావు, రేమాండ్‌పీటర్, చంద్రవదన్, హరిప్రీత్‌సింగ్, సునిల్, జర్నలిస్టు ప్రేమ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. పూనం మాలకొండయ్య తదితర అధికారులు ప్రభుత్వానికి పలు సిఫారసులు చేశారు. హోం, ఐటి, రవాణా, మెడికల్ అండ్ హెల్త్, ఉమన్ అండ్ చైల్డ్ వెల్‌ఫేర్, కార్మిక శాఖ, పాఠశాల విద్య, రెవిన్యూ తదితర శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలు చేశారు. బస్సులు, బస్‌స్టాపులు, జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ఆకతాయిల వేధింపులను అరికట్టేందుకు అమలు చేస్తున్న కార్యక్రమాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈవ్‌టీజర్లను గుర్తించడానికి నిఘా పెట్టామని, ఇప్పటికే చాలా మంది ఈవ్‌టీజర్లను గుర్తించామని, వారికి ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, వారి ఫోటోలు తీస్తున్నామని, ఫింగర్ ప్రింట్స్ కూడా తీస్తున్నామని చెప్పారు. ఈవ్‌టీజర్ల తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలకు కూడా లేఖలు రాస్తున్నట్లు వెల్లడించారు. కోఠి, మెహిదీపట్నం, సికిందరాబాద్ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఈవ్‌టీజింగ్ ఎక్కువగా జరుగుతుందని గుర్తించినట్లు అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పైన

పేర్కొన్న మూడు ప్రాంతాలతో పాటు జనం రద్దీ ఎక్కువగా ఉండే ఇతర ప్రాంతాల్లో సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి బస్సుల్లో ముందు వైపు మహిళలు, వెనుకవైపు పురుషులు ఎక్కి దిగేలా చూడాలన్నారు. కండక్టర్ రెండు వైపులా తిరిగే విధంగా మధ్యలో స్లైడర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కర్మ భూమి, వేద భూమి అని చెప్పుకుంటున్నప్పటికి మహిళలకు సమాజంలో ఏ మాత్రం గౌరవం దక్కడం లేదని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో తల్లి, భార్య, బిడ్డ, సోదరి రూపంలో మహిళలు ఉన్నారని, మహిళల భద్రత ప్రతి ఒక్కరికి సంబంధించిన అంశమని సిఎం వెల్లడించారు. మహిళల గౌరవాన్ని కాపాడటం, వారి భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనికోసం షార్ట్ ఫిల్మ్‌లు, అడ్వర్టైజ్‌మెంట్ల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో మహిళల భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలను జిల్లాలకు కూడా విస్తరించాలని చెప్పారు. ప్రతి జిల్లాలో ఓ డిఎస్‌పి స్థాయి అధికారికి ఇందుకోసం ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని సూచించారు. ఆటో రిక్షాలు, ట్యాక్సీల నిర్వహణను కూడా చాలా జాగ్రత్తగా పరిశీలించాలని, వాటి యజమానులు, డ్రైవర్ల వివరాలను పోలీసుల వద్ద ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిపై ఆరా తీయాలని చెప్పారు. మహిళలు తమ సమస్యలను చెప్పుకోవడానికి వీలుగా 181 టోల్‌ఫ్రీ నెంబర్‌తో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళల సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహిళల కోసం పనిచేసే వివిధ సంస్థలు, వ్యక్తులు, అధికారులను సమన్వయ పరుచుకుంటూ హెల్ప్‌డెస్క్ ప్రభావవంతంగా పనిచేయాలని సూచించారు. పోలీస్ శాఖలోని అన్ని స్థాయిల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఖచ్చితంగా మహిళా విభాగం పనిచేయాలని సూచించారు. హైదరాబాద్‌లో ఉన్న డిఎంఎ లాబరేటరీని బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. జిల్లాల్లో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామన్నారు. సెల్‌ఫోన్, ఇంటర్నెట్, ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి సమాచార సాధనాల ద్వారా మహిళలను వేధిస్తున్నారని, దీనిని అరికట్టడానికి ఐటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. చైనా, గల్ఫ్ దేశాల మాదిరిగా సోషల్ మీడియాపై

నియంత్రణ ఉండే అవకాశాలు కూడా పరిశీలించాలని అధికారులకు చెప్పారు. హైదరాబాద్‌తో పాటు వివిధ నగరాలు, పట్టణాల్లో " షి " ఆటోలు, ట్యాక్సిలు నడపాలని సూచించారు. మహిళా డ్రైవర్లకు 50 శాతం సబ్సిడీపై వాహనాలను సమకూరుస్తామని వెల్లడించారు. భ్రూణ హత్యలను నిరోధించేందుకు, ఆడపిల్లలను చంపడాన్ని అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. గుడుంబా వల్ల చాలా మంది చనిపోతున్నారని, 25-30 ఏండ్ల యువతులే వితంతువులుగా మారాల్సి వస్తున్నదని చెప్పారు. గుడుంబా, నాటు సారాను లేకుండా చేసేందుకు ఏలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై కూడా అధ్యయనం జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వివిధ కారణాల వల్ల రెస్క్యూ హోంలలో ఉంటున్న అమ్మాయిలు, యువతులు, మహిళల విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని చెప్పారు. వారి పోషణ కోసం ప్రస్తుతం నెలకు రూ. 750/- ఇస్తున్నారని, అవి సరిపోవడం లేదని, వాటిని పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అన్ని రంగాలలో మహిళలకు పురుషులతో సమానమైన వేతనాలు అందించాలని, ఎక్కడైనా వివక్ష చూపితే హెల్ప్‌లైన్ ద్వారా పరిష్కరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలలో మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం